

నివాసాల మధ్యే పొగాకు బట్టీలు

పొగాకు పండిస్తున్న రైతులు నివాసాల మధ్యే బట్టీలు ఏర్పాటు చేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

- 10లో ▸



నీటి విడుదల

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాల్వ ద్వారా 5500 క్యూసెక్కుల నీరు వెళ్తోంది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0 /10.2

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి రైల్వే గేట్ మూసివేత

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ – మోస్రా రోడ్డులో హనుమాన్ టేక్డి కాలనీ వద్ద ఉన్న రైల్వేగేట్‌ను శుక్రవారం నుంచి ఆదివారం మూసివేయనున్నట్లు బోధన్ స్టేషన్ మాస్టర్ రాము తెలిపారు. గేటు వద్ద మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో గేటు మూసివేస్తామని, బోధన్ నుంచి బెల్లాల్, ఊట్‌పల్లి, మోస్రా వైపు వెళ్లే వాహనదారులు రాకాసీపేట్ మీదుగా, అటువైపు నుంచి బోధన్ వైపునకు వచ్చేవారు ఎరాజ్‌పల్లి మీదుగా రావాలన్నారు.

రేపు చెరుకు రైతులతో సమావేశం

ఎడపల్లి/బోధన్: మూతపడిన నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్డీఎస్ఎల్)ను రాష్ట్ర ప్రభుత్వం పున:ప్రారంభించాలని నిర్ణయించిన నేపథ్యంలో చెరుకు సాగు అంశంపై చర్చించేందుకు మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో ఈ నెల 4న రైతులతో సమావేశం నిర్వహించనున్నారు. ఎడపల్లిలోని సరయూ ఫంక్షన్ హాలులో మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభం కానున్న సమావేశానికి రాష్ట్ర షుగర్ కేన్ కమిషనర్, జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు హాజరు కానున్నారు. చెరుకు సాగును ప్రోత్సహించేందుకుగాను రైతులకు అవగాహన కల్పించే లక్ష్యంతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రైతులు అధిక సంఖ్యలో రావాలని ఎడపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పులి శ్రీనివాస్ కోరారు.

పోస్టర్ల ఆవిష్కరణ



ఖలీల్ వాడి : జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల పోస్టర్లను గురువారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీటీవో ఉమామహేశ్వరరావు, ఎంవీఐ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ వెంచర్‌లో దేవాదాయ శాఖ భూముల గుర్తింపు



మాక్లూర్ : మాక్లూర్ మండలం మానిక్‌బండార్ శివారులోని ప్రైవేటు వెంచర్‌లో కబ్జాకు గురైన దేవాదాయ శాఖకు చెందిన భూమిని అధికారులు గుర్తించి గ్రామస్తులకు హద్దులు చూపించారు. సుమారు 217 ఎకరాల విస్తీర్ణంలో వెలిసిన వెంచర్లో యజమానులు అనేక అక్రమాలకు పాల్పడ్డారని స్థానిక కార్పొరేటర్ రాయ్ సింగ్ ఏడాది కాలంగా అధికారులకు ఫిర్యాదు చేస్తూ వస్తున్నారు. ఈ అక్రమాలపై 'సాక్షి' లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన అధికారులు విచారణ ప్రారంభించారు. గురువారం నాటితో మూడు దఫాలుగా సర్వే చేశారు. సర్వే నంబర్ 499లో 30 గుంటలు, 480లో 14 గుంటలు, 477లో 2ఎకరాల 5గుంటలు, 503లో 19 గుంటలు, 548లో 29 గుంటలు దేవాదాయ శాఖకు చెందిన భూమిగా గుర్తించారు. గ్రామస్తులు హద్దులు పోతున్నారు. తహసీల్దార్ అధికారికంగా ఇచ్చిన సర్వే పత్రం ఆధారంతో భూమిని స్వాధీనం చేసుకుంటామని కార్పొరేటర్ రాయసింగ్ వెల్లడించారు. ఈ సర్వేలో దేవాదాయ శాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ శ్రీరామ్ రవీందర్, జూనియర్ అసిస్టెంట్లు సుమన్, లక్ష్మణ్, సర్వేయర్ శ్రీను నాయక్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షఫీ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ప్రభు, నర్సాగౌడ్, గోవర్ధన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్ రోడ్డులో..



నిజామాబాద్ రూరల్: నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో ఉన్న ఆర్టీసీ డిపో వెనుకాల ఉన్న ఆలయ మాన్యం భూమిని దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులు గురువారం సర్వే చేశారు. సర్వే నంబర్ 1491లో 4 ఎకరాల 22 గుంటలు, 1492లో ఒక ఎకరం 8 గుంటలు, 1495లో ఒక ఎకరం 25 గుంటలు, 1496లో ఒక ఎకరం 36 గుంటలు భూమి ఉందని, హద్దులు గుర్తించామని సర్వే అధికారులు తెలిపారు. దేవాదాయశాఖ ఇన్‌చార్జి సహాయ కమిషనర్ శ్రీరాంరవీందర్, సర్వే అధికారి ఎంఏ సయీద్, దేవాదాయ, ధర్మాదాయ పరిశీలకులు బి కమలతో పాటు వివిధ ఆలయాల ఈవోలు వేణు, రాములు, అధికారులు ప్రశాంత్‌కుమార్, ఆంజనేయులు, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.



కమిషన్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన హోలియ దాసరి కులస్తులు



బుర్రకథ చెబుతూ వస్తున్న బుడగ జంగం కులస్తులు

ఏకసభ్య కమిషన్‌కు వినతుల వెల్లువ

- ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయాలను తెలియజేసిన ఆయా వర్గాల ప్రజలు
- కమిషన్‌కు స్వాగతం పలికిన కలెక్టర్ హనుమంతు,ఉన్నతాధికారులు
- ఉమ్మడి జిల్లా నుంచి హాజరైన షెడ్యూల్డ్ కులాల ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, వైద్యులు

నిజామాబాద్‌అర్బన్ : ఎస్సీ వర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ బహిరంగ విచారణ కోసం గురువారం జిల్లా కేంద్రానికి వచ్చింది. హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లో బహిరంగ విచారణ చేపట్టింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాల ప్రజాప్రతినిధులు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వైద్యులు, న్యాయవాదులు, షెడ్యూల్డ్ కుల సంఘాల నాయకులు, వివిధ వర్గాల వారి నుంచి వినతులు స్వీకరించి, వర్గీకరణపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. మాదిగలు, మాలలు, జంగములు, చిందులు, బేడ బుడగ జంగములు, బైండ్ల, మంగులతోపాటు వివిధ వర్గాల ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలను తెలియజేస్తూ విజ్ఞాపనలు అందజేశారు. బుడగ జంగాలు, బైండ్ల, చిందులు తదితరులు తమ వృత్తిని తెలుపుతూ సంప్రదాయ వేషధారణతో కలెక్టరేట్‌కు తరలివచ్చి కమిషన్‌కు తమ స్థితిగతులను తెలిపారు. సామాజిక–ఆర్థిక వెనుకబాటు కారణంగా విద్య, ఉద్యోగాలు తదితర రంగాల్లో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ప్రస్తావిస్తూ పలువురు వర్గీకరణ ఆవశ్యకతను చెప్పగా, వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, వర్గీకరణ పేరుతో ఎస్సీలను విభజించడం సబబు కాదని మరికొందరు కమిషన్‌కు తమ అభిప్రాయాలను వెల్లడించారు.



పాల్గొన్న దళిత, ఎస్సీ, ఇతర కులాల ప్రతినిధులు

ఘనస్వాగతం

ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం వద్ద కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల డీఎస్‌సీడీవోలు నిర్మల, రజిత తదితరులు ఘన స్వాగతం పలికారు. షమీమ్ అక్తర్ వెంట రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అదనపు సంచాలకులు శ్రీధర్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ తదితరులున్నారు.

ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ షమీమ్ అక్తర్

ఎస్సీ వర్గీకరణపై అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేస్తామని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ పేర్కొంది.

ఈ సందర్భంగా షమీమ్ అక్తర్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అంశంపై అన్ని వర్గాల వారి అభిప్రాయాలను తెలుసుకుని, క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను కలుపుకుని ఇప్పటివరకు 9 జిల్లాల్లో అభిప్రాయ సేకరణ పూర్తయ్యిందని తెలిపారు. వర్గీకరణ అంశంతోపాటు సామాజిక స్థితిగతులకు సంబంధించి షెడ్యూల్డ్ కులాలకు చెందిన అన్ని వర్గాలవారు ఎలాంటి ఒత్తిడి లేకుండా నిర్భయంగా కమిషన్‌కు తమ అభిప్రాయాలను వెల్లడించొచ్చని సూచించారు.


మొత్తం 555

నిజామాబాద్‌అర్బన్: ఎస్సీ వర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం, బహిరంగ విచారణ కోసం వచ్చిన ఏకసభ్య కమిషన్‌కు ఆయా వర్గాల ప్రజల నుంచి మొత్తం 555 వినతులు అందాయి. హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వినతులు స్వీకరించి అభిప్రాయాలను తెలుసుకుంది.

అవే దౌర్జన్యాలు

చెలరేగిపోతున్న వీడీసీలు

- గ్రామాల్లో సామాజిక బహిష్కరణలు
- కేసులను లెక్కచేయని తెగింపు
- ఆగడాలకు అడ్డుకట్ట వేయాలంటున్న బాధితులు
- చర్యలు తీసుకుంటాం : కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : గ్రామ అభివృద్ధి క మిటీల పేరుతో గ్రామాల్లో పనిచేస్తున్న వ్యవస్థలు ప్రభుత్వానికి సమాంతరంగా వ్యవహరిస్తున్నాయి. జిల్లాలోని చాలా గ్రామాల్లో ఉన్న వీడీసీలు తమకు తామే సుప్రీం అన్నట్లుగా ఇష్టారాజ్యాన్ని కొనసాగిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో మనుషలు, జంతువులు, భూములు అన్నింటిపై తమదే పెత్తనం అన్నట్లుగా ఈ వీడీసీలు చెలరేగిపోతున్నాయి. మేమే రాజులం.. మేమే మంత్రులం అన్నవిధంగా గ్రామంలో పాలన నుంచి మొదలు తాము చెప్పిందే న్యాయం అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. చివరకు పాల ప్యాకెట్లు, కోడి గుడ్డు ఎవరు అమ్ముకోవాలో, ఎంత ధరకు అమ్ముకోవాలో అనేది కూడా వీడీసీలే నిర్ణయిస్తున్న పరిస్థితి. వీడీసీల ఆగడాలు తరచూ వెలుగులోకి వస్తున్నప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం శాశ్వత పరిష్కారం చూపకపోతుండడంతో మళ్లీ మళ్లీ పునరావృతం అవుతున్నాయి. పోలీసు కేసులు పెట్టి జైలుకు పంపినప్పటికీ మార్పు రావడం లేదు. తాజాగా జిల్లాలో మరికొన్ని ఘటనలు వెలుగులోకి వచ్చాయి.

తాజాగా వేల్పూర్ మండలంలోని పోచంపల్లిలో వీడీసీ ఏకంగా ఒకే కులానికి చెందిన పది కుటుంబాలను సామాజికంగా బహిష్కరించింది. గ్రామంలో మూడు చోట్ల ఉన్న ప్రభుత్వ భూమిని ముగ్గురు వ్యక్తులకు అమ్మేందుకు వీడీసీ నిర్ణయించింది. దీనిపై గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాల వారు అభ్యంతరం చెప్పారు. ప్రభుత్వ భూములు అమ్మవద్దని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వేల్పూర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గ్రామంలో సర్వే నిర్వహించి సదరు స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు రంగం సిద్ధం చేశారు. దీంతో ఆగ్రహించిన వీడీసీ సభ్యులు సదరు ఫిర్యాదు చేసిన కుటుంబాలకు రూ.3 లక్షల జరిమానా విధించింది.

జరిమానా చెల్లించని పక్షంలో సామాజిక బహిష్కరణ చేస్తూ తీర్మానం చేసింది. దీంతో బాధిత కుటుంబాలకు చెందిన వాళ్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసు ఫిర్యాదు చేయడాన్ని తప్పుబడుతూ వీడీసీ గ్రామంలో ఈ కుటుంబాలను సామాజికంగా బహిష్కరణ చేశామని, వీళ్లకు పాలు, కిరాణ తదితర వస్తువులు అమ్మవద్దని చాటింపు వేయించారు. పొలాల్లో పనిచేసేందుకు కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు సైతం వెళ్లవద్దని వీడీసీ అల్టిమేటం జారీ చేసింది. బహిష్కరణకు గురైన కుటుంబాలకు సంబంధించిన వ్యవసాయ పనులకు వెళితే వారికీ జరిమానాలు విధిస్తామని ప్రకటించడం గమనార్హం. అయితే పోలీసులకు ఫిర్యాదు చేసినందుకు రూ.10 లక్షలు జరిమానా చెల్లించాల్సిందేనని హుకుం జారీ చేయడం వీడీసీ తీరుకు అద్దం పడుతోంది. చివరకు పోలీసులు గత డిసెంబర్ 31న ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ వీడీసీ సభ్యుల తీరు మారలేదు. నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టాల్సిన నేపథ్యంలో పోలీసులు సాధారణ స్టేషన్ బెయిల్ కేసులు మాత్రమే నమోదు చేయడంతో వీడీసీ సభ్యులు బాధిత కుటుంబాలను మరింత ఇబ్బందులు పెడుతున్నారు. వీడీసీల అరాచకాలను అరికట్టేందుకు ఉన్నతాధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వస్తున్నాయి. పోచంపల్లి వీడీసీ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును 'సాక్షి' వివరణ కోరగా తక్షణమే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

> ఇటీవల ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో తాటి చెట్ల వివాదంలో గౌడ కులస్తుల వద్ద గ్రామస్తులెవరూ కల్లు తాగొద్దంటూ వీడీసీ తీర్మానం చేసింది. ఇప్పటికీ ఈ తీర్మానం అమలులో ఉంది.

ఇందల్వాయి ఎస్ఐపై ఐజీకి ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలోని ఇందల్వాయి పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ బి మనోజ్ పై లింగాపూర్ గ్రామానికి చెందిన లింగాపూర్ సంతోష్‌రెడ్డి, దగ్గి సతీష్‌లు మల్టీజోన్–1 ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మనోజ్ భారీ అవినీతికి పాల్పడుతూ మండల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఐ సొంతంగా జేసీబీలతో లింగాపూర్ వాగు, గౌరారం వాగుల నుంచి ఇసుకను తవ్వించి జైపాల్ నాయక్, శ్రీను, రమేష్ అనే వ్యక్తులతో టిప్పర్, ట్రాక్టర్‌ల ద్వారా రవాణా చేయిస్తున్నాడని, భారీగా డబ్బు సంపాదిస్తున్నాడని, గతంలో ఏ అధికారీ ఇలా చేయలేదని తెలిపారు. ఇప్పటికే మనోజ్ ఇసుక అక్రమ రవాణా విషయమై డీజీపీ మెమో సైతం ఇచ్చినట్లు పేర్కొన్నారు. అయితే ఆ సమయంలో సీపీ బదిలీ కావడంతో చర్యలు తీసుకోలేదని ఫిర్యాదులో తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న విషయమై వార్తలు సైతం వచ్చినట్లు పేర్కొన్నారు. పైగా ఎస్ఐ మనోజ్ ప్రతి కేసులో డబ్బులు డిమాండ్ చేస్తూ భారీగా వసూలు చేస్తున్నాడని వివరించారు. డబ్బులు ఇవ్వని వారిని బెదిరించడం, ఇష్టం వచ్చినట్లు కొట్టడం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 20 రోజుల క్రితం ఒక కేసు విషయంలో నల్లవెల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని డబ్బుల విషయంలో రక్తం వచ్చేలా కొట్టగా, సదరు వ్యక్తి తిరిగి ఎస్సైని కొట్టడంతో గాయాలైనట్లు మండలంలో చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. ఒక రాజకీయ నాయకుడి ద్వారా ఇద్దరూ రాజీ చేసుకున్నట్లు తెలుస్తోందన్నారు. మండల ప్రజలకు న్యాయం చేయాల్సింది పోయి పోలీసుల పరువు తీస్తున్నట్లు ఫిర్యాదులో రాశారు. నల్లవెల్లి గ్రామ రైతుల వద్ద బలవంతంగా ఒక కేసులో రూ.50 వేలు వసూలు చేశాడని తెలిపారు. ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుంటే ఎస్సై మనోజ్ రైతుల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని, అదేవిధంగా మట్టి ట్రాక్టర్ల వద్ద సైతం భయపెట్టి డబ్బులు వసూలు చేస్తుండడం పట్ల ప్రజలు విసుగుమ చెందుతున్నట్లు వివరించారు. ఇతని అవినీతి గురించి మండలంలో అందరికీ తెలుసని, తక్షణమే తగిన విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి



బోధన్ నియోజక వర్గ బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

- బీఆర్ఎస్ శ్రేణులకు ఎమ్మెల్సీ కవిత దిశానిర్దేశం
- బోధన్ నియోజక వర్గ పార్టీ నాయకులతో సమావేశం

బోధన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బోధన్ నియోజక వర్గ బీఆర్ఎస్ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. వార్డు స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసుకోవాలన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో బోధన్ నియోజక వర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆమె సమావేశం నిర్వహించారు. కవిత మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్న విషయాన్ని ఎప్పటికప్పుడు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. పార్టీ నియోజక వర్గ ముఖ్య నాయకులు కొందరు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయాక కొందరు పార్టీలు మారారని, ఈ పరిస్థితుల్లో వార్డు స్థాయి పార్టీ కమిటీలను నియమించాల్సిన అవసరం ఉందని కవిత దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేతృత్వంలో సుదీర్ఘకాలం పోరాడి ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నామని, అనేక ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత పార్టీకి ఉందని పేర్కొన్నారు. నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, పార్టీ నాయకులు అయేషా ఫాతిమా, వీఆర్ దేశాయ్, గిర్దావర్ గంగారెడ్డి, రవి కిరణ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, నర్సింగ్‌రావు, గోగినేని నర్సయ్య పాల్గొన్నారు.

నిలిచిన బియ్యం సరఫరా!

- నిరవధిక సమ్మెలోకి సివిల్ సప్లయీస్ హమాలీలు
- ఎక్కడి లారీలు అక్కడే.. మూతబడిన ఎంఎల్ఎస్ పాయింట్లు
- 40 శాతం రేషన్ దుకాణాలకు మాత్రమే చేరిన బియ్యం
- వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిండుకున్న నిల్వలు



నిజామాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద నిలిచి ఉన్న లారీలు

సుభాష్‌నగర్: సివిల్ సప్లయీస్ హమాలీల సమ్మె కారణంగా జిల్లాలోని రేషన్ దుకాణాలు, వసతిగృహాలు, అంగన్‌వాడీలు, రెసిడెన్షియల్స్కు బియ్యం సరఫరా నిలిచిపోయింది. డిసెంబర్ 31వ తేదీ వరకు కేవలం 40 శాతం రేషన్‌దుకాణాలకు మాత్రమే పీడీఎస్ బియ్యాన్ని సరఫరా చేశారు. పెరిగిన హమాలీ రేట్ల జీవోను విడుదల చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని యూనియన్ ఆధ్వర్యంలో గత డిసెంబర్ 18న కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. అదేరోజున సమ్మె నోటీ సు సైతం అందజేశారు. హమాలీల సమ్మెతో జిల్లా వ్యాప్తంగా పీడీఎస్ బియ్యం సరఫరా చేసే లారీలు ఎక్కడికక్కడ నిలిచిపోగా ఎంఎల్ఎస్ పాయింట్లు మూతపడ్డాయి.

8 పాయింట్లు.. 104 మంది హమాలీలు

జిల్లాలో 8 ఎంఎల్ఎస్ పాయింట్లు (గోదాములు) ఉన్నాయి. ప్రతినెలా ఈ పాయింట్ల నుంచే రేషన్ దుకాణాలు, అంగన్‌వాడీలు, రెసిడెన్షియల్స్, పాఠశాలలకు బియ్యం సరఫరా అవుతుంది. సుమారు 8వేల మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ అవుతుండగా, ఆయా పాయింట్లలో 104 మంది హమాలీలు, 8 మంది (పాయింట్‌కు ఒకరు చొప్పున) స్వీపర్లు పని చేస్తున్నారు. ప్రతినెలా 18 నుంచి 30 వరకు రేషన్ దుకాణాలకు, 5నుంచి స్కూళ్లు, అంగన్‌వాడీలు, రెసిడెన్షియల్స్‌కు బియ్యం సరఫరా చేస్తారు.

నాలుగైదు రోజులకే..

జిల్లాలోని 751 రేషన్‌దుకాణాలు, సుమారు వెయ్యికిపైగా స్కూళ్లల్లో మధ్యాహ్న భోజనం, 1500 వరకు అంగన్‌వాడీలు, 100 వరకు వివిధ రకాల హాస్టళ్లు, రెసిడెన్సియళ్లకు హమాలీల సమ్మె వల్ల బియ్యం సరఫరా నిలిచిపోయింది. ఇప్పటికే రేషన్‌దుకాణాల వద్దకు కార్డుదారులు వచ్చి వెళ్తుండగా, స్కూళ్లు, హాస్టళ్లు, రెసిడెన్సియళ్లు, అంగన్‌వాడీల్లో బియ్యం నిల్వలు నిండుకున్నాయి. మరో నాలుగైదు రోజులకు సరిపడా మాత్రమే బియ్యం ఉన్నట్లు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది.

జీవో విడుదల చేయాలి

పెరిగిన హమాలీ రేట్ల జీవో విడుదల చేయాలని సివిల్ సప్లయీస్ హమాలీలు, స్వీపర్లు సమ్మె చేస్తున్నారు. క్వింటాల్ బియ్యం లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తే హమాలీలకు రూ.26 చెల్లిస్తున్నారు. అయితే ప్రభుత్వం, కమిషనర్ చౌహాన్, యూనియన్ నాయకుల మధ్య జరిగిన చర్చల్లో హమాలీలకు క్వింటాల్‌కు రూ.29, స్వీపర్లకు రూ.వెయ్యిచొప్పున (గోదాం సామర్థ్యం బట్టి) పెంచేందుకు అక్టోబర్ 4న ఒప్పందం కుదిరింది. 2024 జనవరి 1 నుంచి పెరిగిన ఏరియర్స్ చెల్లించాలని ఒప్పు కున్నప్పటికీ జీవో విడుదల కాలేదు. హమాలీలు డిసెంబర్ 18న కమిషనర్ కార్యాలయం ముట్టడించగా,వారంలోపు జీవో విడుదల చేస్తామని జీఎం ప్రకటించారు. జీవో విడుదల కాకపోవడంతో హమాలీలు ఈనెల 1 నుంచి నిరవధిక సమ్మెకు దిగారు.

జీవో విడుదల చేసి న్యాయం చేయాలి



సివిల్ సప్లయీస్ హమాలీలు, స్వీపర్ల పెరిగిన రేట్లకు సంబంధించి జీవో విడుదల చేయాలి. జనవరి 1 నుంచి ఏరియర్స్ కూడా ఇవ్వాలి. సమస్య చిన్నదే అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పెరుగుతోంది. ఒప్పందం ప్రకారం జీవో ఇవ్వడానికి సివిల్ సప్లయీస్ అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావడం లేదు.

– ఎం దేవేందర్, ప్రధానకార్యదర్శి, సివిల్ సప్లయీస్ హమాలీ యూనియన్

సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె



సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ హమాలీలు, స్వీపర్ల సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తాం. కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ ఒక్కరే ఉన్నా.. రెండు నెలలుగా జాప్యం చేస్తున్నారు. ఆర్థికశాఖ, మంత్రి వద్ద ఉందని కాలయాపన చేస్తున్నారు. పెరిగిన రేట్ల ప్రకారం జీవో వెంటనే విడుదల చేయాలి.

– వై ఓమయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సివిల్ సప్లయీస్ హమాలీ యూనియన్

జిల్లాను ముందంజలో నిలుపుదాం




కలెక్టర్‌కు నోట్ బుక్కులు అందిస్తున్న అధికారులు

నిజామాబాద్‌అర్బన్: నూతన సంవత్సరంలో మరింత ప్రగతి సాధించి జిల్లాను ముందంజలో నిలుపుదామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్‌లో కలెక్టర్‌ను గురువారం ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల బాధ్యులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ నేతత్వంలో ఆఫీసర్స్‌క్లబ్ కార్యవర్గం, రెడ్‌క్రాస్ సొసైటీ, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, బ్రహ్మకుమారీలు తదితరులు కలెక్టర్‌ను కలిశారు. బహుతులుగా వచ్చిన నోట్ పుస్తకాలు, పెన్నులు, దుప్పట్లను సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు అందజేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న నీటి విడుదల



బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి యాసంగి సీజన్‌ కోసం కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది. ప్రాజెక్ట్‌ నుంచి కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, వరదకాలువ ద్వారా 5వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 700 క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 200 క్యూసెక్కులు, అలీసాగర్‌ లిఫ్టు ద్వారా 470 క్యూసెక్కులు, గుత్ప లిఫ్టు ద్వారా 270 క్యూసెక్కులు, ముంపు గ్రామాల ఎత్తిపోతల పథకాలకు 312 క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 475 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1089.20 (74 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు పేర్కొన్నారు.

నేడు పాసింగ్‌ అవుట్‌ పరేడ్‌

డిచ్‌పల్లి: మండలంలోని రాష్ట్ర ప్రత్యేక పోలీస్‌ ఏడవ బెటాలియన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న టీజీఎస్పీ కానిస్టేబుళ్లకు శుక్రవారం (3న) పాసింగ్‌ అవుట్‌ పరేడ్‌ నిర్వహించనున్నట్లు కమాండెంట్‌ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. టీజీఎస్పీ ట్రెయినీ కానిస్టేబుళ్లుగా ఎంపికైన 463 మందికి గత 9 నెలలుగా డిచ్‌పల్లి 7వ బెటాలియన్‌లో వివిధ అంశాలలో శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం వారి శిక్షణ పూర్తయినందున శుక్రవారం పాసింగ్‌ అవుట్‌ పరేడ్‌ నిర్వహించి వారికి ఆయా బెటాలియన్లలో విధులు కేటాయింపునకు సంబంధించి నియామక ఉత్తర్వులను అందజేస్తారని తెలిపారు. ఈ పాసింగ్‌ అవుట్‌ పరేడ్‌లో ముఖ్య అతిథిగా నిజామాబాద్‌ ఇన్‌చార్జి సీపీ సింధు శర్మ పాల్గొంటారని ఆయన తెలిపారు.

రోడ్డు పనులు పూర్తిచేయించాలి



వేల్పూర్‌: బాల్కొండ నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రహదారుల పనులను పూర్తి చేయించాలని వేల్పూర్‌ మార్కెట్‌ కమిటీ పాలవర్గం సభ్యులు కోరారు. ఈమేరకు వారు గురువారం డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌లో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి విన్నవించారు. పనులను తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు. అలాగే మంత్రికి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్‌ కొత్తింటి ముత్యంరెడ్డి, వైస్‌చైర్మన్‌ గడ్డం నర్సారెడ్డి, ముప్కాల్‌ మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్‌ రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్‌ పతకాలు



నిజామాబాద్‌ నాగారం: రాష్ట్రస్థాయి సీఎం కప్‌ టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన కుస్తీ క్రీడాకారులు పతకాలు సాధించారు. హన్మకొండలో జరుగుతున్న పోటీల్లో రెండు బంగారు, రెండు రజత, ఒక కాంస్య పతకం సాధించారు. క్రీడాకారులను డీఎస్‌డీవో ముత్తెన్న అభినందించారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్‌ టోర్నీకి ఎంపిక


ఉదయ్‌

నిజామాబాద్‌ నాగారం: జాతీయస్థాయి సీనియర్‌ బాస్కెట్‌బాల్‌ టోర్నమెంట్‌కు జిల్లాకు చెందిన ఉదయ్‌ ఎంపికయ్యారు. ఈ నెల 5 నుంచి 12వరకు భవనగర్‌లో జరగనున్న టోర్నీలో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. జిల్లా బాస్కెట్‌బాల్‌ సంఘం అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, ఆర్గనైజర్‌ బొబ్బిలి నరేష్‌ ఉదయ్‌ను అభినందించారు.

భిన్నాభిప్రాయాలు..

- ఎస్సీ వర్గీకరణ కావాలన్న మాదిగ సంఘాలు.. వద్దన్న మాల సంఘాలు..


రిటైర్డ్‌ జస్టిస్‌ షమీమ్‌ అక్తర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు


వినతిపత్రం అందజేస్తున్న మాదిగ రిజర్వేషన్‌ పోరాట సమితి నాయకులు

నిజామాబాద్‌అర్బన్‌: ఎస్సీ వర్గీకరణపై బహిరంగ విచారణ చేపట్టేందుకు వచ్చిన ఏకసభ్య కమిషన్‌ ఎదుట దళిత సంఘాలు, నాయకులు, ఆయా వర్గాల ప్రజలు తమ అభిప్రాయాలను తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేయాల్సిందేనని మాదిగ సంఘాలు, వద్దని మాల సంఘాల నాయకులు వినతి పత్రాలు అందజేశారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన దళితులతోపాటు ఆయా వర్గాల ప్రజలు, దళిత సంఘాల ప్రతినిధులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. హైకోర్టు రిటైర్డ్‌ జస్టిస్‌ షమీమ్‌ అక్తర్‌ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్‌కు తమ అభిప్రాయాలను తెలుపుతూ వినతిపత్రాలు అందజేశారు. మాదిగ రిజర్వేషన్‌ పోరాట సమితి నాయకులు కనక ప్రమోద్‌ మాదిగ, ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్‌ మాదిగ యువజన సంఘం నాయకులు మొదట కమిషన్‌ చైర్మన్‌ను కలిసి వినతి పత్రం అందించారు. 1994లో ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావం నుంచి మాదిగ హక్కుల కోసం మాదిగ ఉప కులాల కోసం నిరంతరం మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో పోరాడుతోందన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును తక్షణమే అమలు చేయాలని మాదిగ జేఏసీ జిల్లా చైర్మన్‌ బర్కుంట శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. వర్గీకరణ వెంటనే చేపట్టాలని ఎమ్మార్పీఎస్‌ యువజన సంఘం నాయకులు సంతోష్‌ విన్నవించగా, ఎస్సీ వర్గీకరణ అవసరం లేదని, అందరికీ సమానమైన రిజర్వేషన్‌ అందుతున్నాయని ఎస్సీలను విడదీయొద్దని జిల్లా మాల సంఘం నాయకులు ఏకసభ్య కమిషన్‌కు విన్నవించారు. మాలసంఘం నాయకులు ఎల్లయ్య తదితరులున్నారు. ఎమ్మార్పీఎస్‌ సీనియర్‌ నాయకుడు నాగభూషణం ఆధ్వర్యంలో మాదిగ రిజర్వేషన్‌ పోరాట సమితి నా యకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వర్గీకరణ చేపట్టి మాదిగలను ఆదుకోవాలని మాదిగ రిజర్వేషన్‌ పోరాట సమితి నాయకులు నాంపల్లి వి న్నవించగా, వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వా గతిస్తున్నామని రాష్ట్ర మోచీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముత్యం, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌ ఏకసభ్య కమిషన్‌కు తెలిపారు.

వర్గీకరణపై తక్షణమే సుప్రీం కోర్టు తీర్పును కొట్టివేయాలని తెలంగాణ మాలసంఘం వ్యవస్థాపకుడు సంతోష్‌ ఏకసభ్య కమిషన్‌కు వినతిపత్రం అందజేశారు.


ర్యాలీగా వస్తున్న ఎమ్మార్పీఎస్‌ నాయకులు


వినతిపత్రం అందజేస్తున్న దండోర నాయకులు

హోలియ దాసరి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

కామారెడ్డి జిల్లా దేవునిపల్లికి చెందిన హోలియ దాసరి సంక్షేమ సంఘం సభ్యులు తమ వృత్తి వేషధారణలో వచ్చి వినతిపత్రం అందజేశారు. కళాకారులకు వయో పరిమితితో సంబంధం లేకుండా పెన్షన్లు మంజూరు చేయాలని కోరా రు. రాత్రిపూట వీధి భాగోతం, యక్షగానం, న త్య ప్రదర్శనలు ఇచ్చే తమ జీవితాలు దుర్భరంగా ఉన్నాయని ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పోచయ్య, చిన్న నర్సింలు,నల్ల పోచయ్య, నడిపి పోచ య్య, పెద్ద సాయిలు, ముత్తయ్య, గంగయ్య, పోచయ్య తదితరులున్నారు. తమను గ్రూప్‌ ఏలో చేర్చాలని కామారెడ్డి చెందిన బుడగ జంగం సంక్షేమ సంఘం సభ్యులు కోరారు.

కవితల పోటీల్లో బహుమతులు


విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): కెనడా దేశం కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా పిల్లల కోసం వెలువడుతున్న మాసపత్రిక 'గడుగ్గాయ్‌' ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి కవితల పోటీల్లో మండలంలోని సిర్‌పూర్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. గురువారం పాఠశాలలో విద్యార్థులను హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ తెలుగు విద్యార్థులందరికీ కవితా పోటీలను గత నెలలో నిర్వహించారని, అందులోభాగంగా తమ పాఠశాల విద్యార్థులు కవితలు పంపారని తెలిపారు. జనవరి 1న విజేతల జాబితాను విడుదల చేశారన్నారు. పదోతరగతి చదువుతున్న టి అక్షయ, జె రచన, పి నందిని, తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎం మాధురి, ఎం మేఘన, ఏడో తరగతి విద్యార్థులు డి సుశాంత్‌, ఎస్‌ చేత్ర బహుమతులను గెలుచుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు కవితా రచనలో మార్గదర్శనం చేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్‌ కాసర్ల నరేశ్‌రావును అభినందించారు. ఉపాధ్యాయులు శ్యా మల, మోహన్‌, గాయత్రి నీలేశ్‌, వందన, అక్బర్‌ బాషా, డాక్టర్‌ హజారే శ్రీనివాస్‌, లలిత పాల్గొన్నారు.

పెండింగ్‌ ఫైళ్లకు మోక్షం



సాక్షి ఎఫెక్ట్‌..

నిజామాబాద్‌ అర్బన్‌: విద్యాశాఖలో పెండింగ్‌ ఫైళ్లకు మోక్షం లభించింది. 'విద్యాశాఖలో కదలని ఫైళ్లు' శీర్షికన గురువారం 'సాక్షి' పత్రికలో ప్రచురితమైన కథనానికి డీఈవో స్పందించి ఫైళ్లను క్లియర్‌ చేశారు. సర్వీస్‌ మేటర్లు, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన ఫైళ్లను క్లియర్‌ చేశారు. అసిస్టెంట్‌ డైరెక్టర్‌ నాగజ్యోతిని ఫైళ్లను పూర్తిగా పరిశీలన చేయాలని ఆదేశించారు.

22 వరకు పరీక్ష ఫీజుచెల్లించండి

నిజామాబాద్‌అర్బన్‌: తెలంగాణ ఓపెన్‌ స్కూల్‌ సొసైటీ పదో తరగతి, ఇంటర్‌ పరీక్షల ఫీజును ఈనెల 22 వరకు చెల్లించాలని డీఈవో అశోక్‌ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణ రుసుముతో ఈ నెల9 నుంచి 22 వరకు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పదోతరగతి వారు ప్రతి సబ్జెక్టుకు రూ. 100, ఇంటర్‌ వారు ప్రతి సబ్జెక్టుకు రూ. 150 రూపాయలు, ఇంటర్‌ ప్రయోగ పరీక్షలకు ప్రతి సబ్జెక్టుకు రూ. 150 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు రూ. 25 అపరాధ రుసుముతో, ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 3 వరకు రూ. 50 అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చని అన్నారు. ఫిబ్రవరి 4 నుంచి 6 వరకు తాత్కాల్‌ రూపంలో పరీక్ష ఫీజును పదో తరగతి వారు రూ. 500, ఇంటర్‌ వారు రూ. 1000 అదనంగా చెల్లించి ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

ప్రశాంతంగా టెట్‌ పరీక్ష

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలో గురువారం ప్రశాంతంగా టెట్‌ పరీక్ష జరిగింది. ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. కేవలం 150 మందికే పరీక్ష జరిగింది. మిగతా వారందరికీ హైదరాబాద్‌ తదితర ప్రాంతాలలో సెంటర్లు కేటాయించడంతో ఇబ్బందులు పడ్డారు.

తెయూ సమాచారం

తెయూ క్యాలెండర్‌, డైరీ ఆవిష్కరణ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పబ్లికేషన్‌సెల్‌ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌, డైరీని గురువారం వర్సిటీ వీసీ ప్రొఫెసర్‌ యాదగిరిరావు, రిజిస్ట్రార్‌ యాదగిరి ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ.. బోధన, బోధనేతర సిబ్బంది సహకారం, సమన్వయంతో పని చేసి తెలంగాణ యూనివర్సిటీని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. క్యాలెండర్‌, డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో పబ్లికేషన్‌ సెల్‌ డైరెక్టర్‌ సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్‌ సీహెచ్‌ ఆరతి, ఆడిట్‌సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌, కంట్రోలర్‌ అరుణ, యూజీసీ కోఆర్డినేటర్‌ ఆంజనేయులు, ఆర్ట్స్‌ డీన్‌ లావణ్య, అధ్యాపకులు అపర్ణ, రాంబాబు, మహేందర్‌, అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ సాయాగౌడ్‌, సూపరింటెండెంట్‌ భాస్కర్‌, ఇంజనీర్‌ వినోద్‌ కుమార్‌ పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్‌ ఆవిష్కరణ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో గురువారం జాతీయ సదస్సు బ్రోచర్‌ను వర్సిటీ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్‌ యాదగిరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఐసీఎస్‌ఎస్‌ఆర్‌ సౌత్‌ సెంట్రల్‌ రీజియన్‌ సహకారంతో ఫిబ్రవరి 20, 21న రెండు రోజుల పాటు సౌత్‌ క్యాంపస్‌లో సోషల్‌ వర్క్‌ విభాగం ఆధ్వర్యంలో 'యూత్‌ అండ్‌ సోషల్‌ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌, పోస్టరింగ్‌ ది క్స్‌జెనరేషన్‌ ఆఫ్‌ చేంజ్‌ మేకర్స్‌ ఇన్‌ ఇండియా (వైఎస్‌ఈ–ఎఫ్‌ఎన్‌జీసీఐ–2025)' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సులో వివిధ రంగాలకు చెందిన నిపుణుల ప్రసంగాలు, పరిశోధక విద్యార్థుల పరిశోధన పత్రాల సమర్పణ ఉంటుందని కన్వీనర్‌ వీరభద్రం తెలిపారు. రాజేశ్వరి, అంజయ్య, సోషల్‌సైన్స్‌ డీన్‌ ఘంటా చంద్రశేఖర్‌, కంట్రోలర్‌ అరుణ, ప్రిన్సిపాల్‌ ఆరతి తదితరులు పాల్గొన్నారు.

టూటా ఆధ్వర్యంలో వీసీకి శుభాకాంక్షలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో గురువారం వైస్‌ చాన్స్‌లర్‌ టి యాదగిరిరావును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, రాజేశ్వరి, జి బాలకిషన్‌, ఎ నాగరాజు, జమీల్‌ అహ్మద్‌, శిరీష బోయపాటి, వాసం చంద్రశేఖర్‌, వీరభద్రం, అంజయ్య, అబ్దుల్‌ ఖవి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

చేపలవేటకు వెళ్లి ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్‌: కాలువలో చేపలవేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..

మహారాష్ట్రకు చెందిన కెశవ్‌ గంగాధర్‌బోస్లే(29) బతుకు దెరువు కోసం ఆరు నెలల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి ఆలూర్‌ మండలం దేగాం గ్రామానికి వచ్చి జీవనం సాగిస్తున్నాడు. కాగ బుధవారం ఉదయం దేగాం శివారులో గల నీటి కాలువలో చేపలు పట్టేందుకు గంగాధర్‌ వెళ్లగా ప్రమాదశావత్తు నీటిలో పడ్డాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ట్రాఫిక్‌ పీఎస్‌లో బైక్‌ చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌లో బైక్‌ చోరీకి గురైంది. మూడు రోజుల క్రితం నగరానికి చెందిన ఓ యువకుడు త్రిబుల్‌ రైడ్‌ చేయడంతో ట్రాఫిక్‌ పోలీసులు పట్టుకుని బైక్‌ను పీఎస్‌కు తరలించారు. సదరు యువకుడు మూడు రోజుల తర్వాత పీఎస్‌కు వచ్చి చలాన చెల్లించడానికి వస్తే బైక్‌ కనిపించలేదు. యువకుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ట్రాఫిక్‌ పోలీస్‌ స్టేషన్‌లోనే బైక్‌ దొంగతనం జరగడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ను వివరణ కోరగా బైక్‌ పోయిందని యువకుడు ట్రాఫిక్‌ పోలీసుల దృష్టికి తెచ్చారని, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

డ్రంకన్‌ డ్రైవ్‌లో 26 మందికి జరిమానా

ఖలీల్‌వాడి: మద్యం తాగి వాహనాలు నడిపిన 26 మందికి జరిమానాలను మెజిస్ట్రేట్‌ విధించినట్లు ట్రాఫిక్‌ సీఐ పి ప్రసాద్‌ గురువారం పేర్కొన్నారు. ట్రాఫిక్‌ పీఎస్‌లో కౌన్సిలింగ్‌ నిర్వహించిన అనంతరం 26 మందిని సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ఎదుట హాజరుపర్చగా మెజిస్ట్రేట్‌ నూర్జహాన్‌ వారికి రూ. 41వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని సూచించారు. తప్పనిసరిగా హెల్మెట్‌ ధరించాలని సీఐ పేర్కొ న్నారు .

పేకాటస్థావరంపై దాడి

నందిపేట్‌: మండలంలోని మాయాపూర్‌ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 9 మందిని అరెస్టు చేయగా వారి నుంచి రూ.9500 నగదు, 8 సెల్‌ఫోన్లు, 8 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చిరంజీవి పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నూతన భూభారతి చట్టానికి ట్రెసా మద్దతు


సీఎం రేవంత్‌రెడ్డితో ట్రెసా ప్రతినిధులు

నిజామాబాద్‌అర్బన్‌: తెలంగాణ రైతాంగ భూయాజమాన్య హక్కుల పరిరక్షణ లక్ష్యంతో తీసుకొచ్చిన నూతన భూభారతి ఆర్వోఆర్‌ చట్టానికి తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్‌ సర్వీసెస్‌ అసోసియేషన్‌ (ట్రెసా) తరఫున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని సంఘ సభ్యులతో కలిసి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీసీఎల్‌ఏ నవీన్‌ మిట్టల్‌ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో ట్రెసా ప్రధాన కార్యదర్శి కె గౌతమ్‌ కుమార్‌, నిజామాబాద్‌ జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, ఉప తహసీల్దార్‌ రంజిత్‌, రాజశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు


సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నాయకులు


సీఎం రేవంత్‌ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్‌ సిటీ/డిచ్‌పల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డిని గురువారం జిల్లా కాంగ్రెస్‌ నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్‌ లిమిటెడ్‌ చైర్మన్‌, జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిలు ముఖ్యమంత్రిని కలిశారు. వీరితోపాటు వేల్పూరు మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ముత్యం రెడ్డి, మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ నర్సారెడ్డి, ముపకల్‌ మండల కాంగ్రెస్‌ అధ్యక్షులు ముత్యం రెడ్డి, జిల్లా కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి జైడి రవి తదితరులు ఉన్నారు.

షీటీం సేవలను ఉపయోగించుకోవాలి


మాట్లాడుతున్న ఎస్సై శివకుమార్‌

నిజాంసాగర్‌(జుక్కల్‌): అత్యవసర సమయంలో షీటీం సేవలను బాలికలు ఉపయోగించుకోవాలని స్థానిక ఎస్సై శివకుమార్‌ సూచించారు. గురువారం అచ్చంపేట ఆదర్శ మోడల్‌ పాఠశాలలో షీటీం సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలికలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పోకిరీల బెడదతో పాటు బస్టాండ్లు, ప్రధాన చౌరస్తాల్లో యువకుల వేధింపుల నివారణకు షీటీంలు దోహదపడతాయన్నారు. సైబర్‌ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని తెలిపారు.

సొసైటీ ఏర్పాటుపై అభిప్రాయ సేకరణ


సొసైటీ ప్రతినిధులతో డీసీవో శ్రీనివాస్‌

నవీపేట: మోకన్‌పల్లి సొసైటీ ఏర్పాటుపై గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా సహకార సంఘం ప్రధాన కార్యాలయంలో జిల్లా సహకార అధికారి శ్రీనివాస్‌ బినోల సొసైటీ ప్రతినిధులతో భేటీ అయ్యారు. మండలంలోని మోకన్‌పల్లి సొసైటీని పదేళ్ల కిందట బినోల సొసైటీలో విలీనం చేశారు. కానీ ప్రస్తుతం సొసైటీ పరిధిలో సభ్యుల సంఖ్యతోపాటు లావాదేవీలు పెరిగాయి. దూరభారం అధికమవడంతో మళ్లీ మోకన్‌పల్లి సొసైటీని పునరుద్ధరించాలని గతంలో పాలకవర్గం తీర్మానించింది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో డీసీవో శ్రీనివాస్‌ బినోల సొసైటీ ప్రతినిధులతో లావాదేవీలు, గ్రామాల వివరాలతోపాటు సభ్యుల వివరాలను తెలుసుకున్నారు. ప్రతినిధుల అభిప్రాయాలను సేకరించారు. చైర్మన్‌ మగ్గారి హన్మాండ్లు, వైస్‌ చైర్మన్‌ ఖాజా ఆశమొద్దీన్‌, డైరెక్టర్లు విజయ్‌, అంజాగౌడ్‌, బానుచందర్‌గౌడ్‌, రమణారావ్‌, నవీన్‌ రావ్‌ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి



కామారెడ్డి క్రైం: సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని పాత జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాల యజమానులతో గురువారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ఆవశ్యకత ఎంతగానో ఉంటుందన్నారు. కెమెరాల ఏర్పాటు కోసం తమ వంతు సహకారం చేయాలని వ్యాపారులకు సూచించారు. వ్యాపారులు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలపడంతో వారికి ధన్యవాదాలు తెలిపారు.

హెల్మెట్‌ తప్పనిసరిగా పెట్టుకోవాలి


మాట్లాడుతున్న డీటీవో ఉమామహేశ్వరరావు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని జిల్లా ట్రాన్స్‌పోర్ట్‌ కార్యాలయంలో రోడ్డు భద్రతా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీవో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ ధరించాలని అన్నారు. రోడ్డుపై వెళ్లే సమయంలో వాహనాలకు కేటాయించిన మార్గాల్లో వెళ్లాలని సూచించారు. కారు నడిపేవారు సీటు బెల్ట్‌ ధరలించాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐలు కిరణ్‌, నిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.

మహారాష్ట్ర మద్యం పట్టివేత



ఖలీల్‌వాడి: మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని నిజామాబాద్‌ ఎక్సైజ్‌ పోలీసులు పట్టుకున్నారు. నవీపేట మండలం యంచ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా.. కారులో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ స్వప్న గురువారం సాయంత్రం తెలిపారు.

వాహనదారులకు కౌన్సెలింగ్‌

కామారెడ్డి క్రైం: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఇటీవల డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన కొందరికి పోలీసులు కౌన్సెలింగ్‌ నిర్వహించారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపకూడదని పట్టణ ట్రాఫిక్‌ ఎస్సై మహేష్‌ సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలన్నారు. మరోసారి మద్యం తాగి వాహనం నడపమని వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్సై రాజారాం, ఏఎస్సై కళాధర్‌ రాజు తదితరులు పాల్గొన్నారు.


టోల్‌ప్లాజా సిబ్బందిపై ఫిర్యాదు

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలో ఉన్న టోల్‌ప్లాజా సిబ్బందిపై కామారెడ్డి పట్టణానికి చెందిన రాజశేఖర్‌ గురువారం భిక్కనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజశేఖర్‌ తన కారులో కామారెడ్డి నుంచి హైదరాబాద్‌ వెళ్తుండగా బుధవారం అర్ధరాత్రి టోల్‌ప్లాజా గేటవద్ద సాంకేతిక లోపంతో ఆగిపోయింది. మెకానిక్‌తో మరమ్మతులు చేయిస్తుండగా తనపై టోల్‌ప్లాజా సిబ్బంది దాడి చేసి, ఇబ్బందికి గురిచేసినట్లు పేర్కొన్నారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

వాహనాల తనిఖీ

బిచ్కుంద(జుక్కల్‌): బిచ్కుందలో గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎస్సై మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు. లేదంటే కేసులు నమోదు చేస్తామన్నారు. డిసెంబర్‌ 31న నాలుగు డ్రంకెన్‌డ్రైవ్‌ కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని సూచించారు.

సెల్‌ఫోన్ల అందజేత



బోధన్‌టౌన్‌: పట్టణ పీఎస్‌ పరిధిలో పలు చోట్ల పోగొట్టుకున్న 15 మంది బాధితులకు వాటిని రికవరీ చేసి అందించినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ గురువారం తెలిపారు. సెల్‌ఫోన్‌ పోయిన వెంటనే పీఎస్‌లో ఫిర్యాదు చేసి సీఈఐఆర్‌ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు.